"అతను నీ కేంకావాలి?" అని అడిగాడాయన హాంగుని చూపుతూ.

"నే నిప్పుడేం చేస్తేమాత్రం నీకేమి సంబంధం?" అని అడిగింది. "నువ్వెవ్వరవు అడగటానికి?"

"పాతరోజులు జ్ఞాపకంచేసుకో. ఇంటికిరా" అని బ్రతిమాలాడు అతను. ఆమె వొక అడుగు ముందుకువేసింది.

"ఇదిగో చెపుతున్నా విను. నా తప్పులేదు అన్నప్పుడు నువ్వు విన్నావుకాదు. నామాట నమ్మావుకాదు. నేను చచ్చినా బ్రతికినా నీకు వొక్కటే అన్నావు. నీ ప్రమేయం ఏమీలేదు అన్నావు. అదృష్టవశాత్తూ నేనుచావలేదు. ఇప్పుడు నేనేం చెస్తేమాత్రం నీ ప్రమేయం ఏముంది?" అంది.

అతని రంగుమారింది. ఆమెను గట్టిగా పట్టుకున్నాడు. ఆమె వొదిలించుకోటానికి పెనుగులాడింది. నన్ను విడిచిపెట్టు....విడువు అని కేకలు వేసింది.

ఆమెధైర్యానికి పూర్వపుభర్త ఆశ్చర్యచకితుడైనాడు. వొదిలిపెట్టి ఊరుకున్నాడు. ఆమె హాంగుదగ్గరకువరుగెత్తింది.

వాళ్లు వొకరిచేతులు వొకరు పెనవేసుకొని యింకొక మాటకూడా మాట్లాడకుండా వెళ్ళిపోయారు. వారు వెళ్తూవుంటే "నేను నిన్ను క్షమించా చున్నా, నేను నిన్నుక్షమించా" అనే అతని మాటలు వారికి వినిపించినై.

(చైనా కథకు అనువాదం)

# ఆటు!

మావాళ్ళు వూళ్ళోలేరు. వాళ్ళ పినతల్లికూతురు పెళ్ళికి ఖర్గపురం వెళ్ళారు. నేను హోటల్‌నుంచి క్యారియర్ తెప్పించుకొని కాలక్షేపం చేస్తున్నాను. అవ్వాళ ప్రొద్దున్న నేను లేచేటప్పటికి ఇంకా ప్యూన్ రాలేదు. వాడికోసం ఎంతసేపు కాచుకు కూర్చునేటట్టని, మొహం కడుక్కొని, హోటలుకి బయలుదేరాను. హోటల్లో కొంచెం తాకిడీ ఎక్కువగానేవుంది. తాగేకాఫీ తీరిగ్గా తాగే అలవాటు నాకు. అందుకు అనుకూలమైన స్థలం యెక్కడవుందా, అని కలయజూశాను. ఒకమూల కాఫీ త్రాగుతున్న నామిత్రుడు పున్నారావు కనుపించాడు. అతన్నిచూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. ఒక గుక్కెడు కాఫీ త్రాగి, కప్పు బల్లమీద పెట్టాడు. తనలోతాను నవ్వుకుంటున్నాడు. దూరానవున్న నాకు వినబడలేదు గాని, నెమ్మదిగా ఈల వేస్తున్నాడేమో అని కూడా అనిపించింది నాకు. నేను సరాసరి అతనిదగ్గరకువెళ్ళి, ఎదురుగావున్న కుర్చీలో కూర్చున్నాను.

నన్నుచూచి "నువ్వా?" అన్నాడు పున్నారావు. అని మళ్ళీ తనలో తాను నవ్వుకోవటం మొదలు పెట్టాడు. "కాఫీ తాగుతావా," అన్నాడు. "తాగు" అన్నాడు. సర్వర్‌కి చెప్పావు. నావంకకు తిరిగి, "చూశావోయ్, ప్రపంచం ఎంత చిత్రంగావుందో!" అన్నాడు.

"ఏం జరిగిందోయ్, మాంచి పైలా పచ్చీసులో వున్నావు?" అని అడిగాడు.

"ఏంలేదు బాదంచెట్టు," అన్నాడు పున్నారావు. కాఫీ వొక్క-గుక్కెడు త్రాగి కప్పు మళ్ళీ బల్లమీద పెట్టాడు. చటుక్కున, "మా ఇంటి ప్రక్కనే ఒక పోలీసు వుద్యోగి ఉన్నాడు నీకు తెలుసా? అతని ముఖారవిందం నువ్వెప్పుడైనా చూశావా?" అని అడిగాడు.

"అతనేగదూ నల్లగా.పొడుగ్గా ఉంటాడు. వూళ్ళో కనుపించిన ఆట్కావాళ్ళ నల్లా చావమోదు తుంటాడు.... మీ ఇంటికి దక్షిణాన...."

"ఆఁ ఆఁ అతనే...." అన్నాడు పున్నారావు కులుకుతూ.

"అతను ఉన్న ఇంట్లోనే ఒక భాగంలో వసురాయకవి వుంటున్నాడు...."

"ఆఁ ఆఁ వాళ్ళసంగతే." అన్నాడు పున్నారావు. అని "వాళ్ళ యింటిముందు దొడ్లో వొక బాదంచెట్టు వుంది" అన్నాడు.

నేను వొప్పుకున్నాను. "యెండకు విప్పిన గొడుక్కమల్లే వుంటుంది." అన్నాను.

"అవును. మొదలేమో వసురాయకవి భాగంలో ఉంటుంది. ఎక్కువ కొమ్మలు ఆ పోలీసు ఉద్యోగి భాగంలోకి వ్యాపించి వుంటై...."

నేను దీనికి వొప్పుకున్నాను. "ఇంతంత ఆకులు," అన్నాను.... "వి స్తర్లకు బాగా పనికివస్తయి" అన్నాను.

"ఆఁఆఁ ఇప్పుడు ఆ చెట్టు కేమూడింది." అన్నాడు.

ఏం జరిగిందో చెప్పమని నేను అడిగాను.అతను మొదలుపెట్టాడు.... "రాత్రి, ఆ పోలీసు వుద్యోగి, అందర్నీ నిద్రపోనిచ్చి ఆ చెట్టు మొదలు నరికాడు...."

"చెట్టు నరకటం ఏమిటి?" అని నేను ఆశ్చర్యపోయాను. "యెందుకు?" అని అడిగాను.

"విను మరీ" అన్నాడు మిత్రుడు. "ఆచెట్టు సరిహద్దు గోడమీదుగా పోలీసు వుద్యోగి దొడ్డిలోకి వాలింది. అంటే ఒక్క మొదలు మాత్రం వసురాయకవి దొడ్డిలో వుండి, మిగిలిన చెట్టంతా పోలీసు ఉద్యోగి దొడ్డిలోకి పడింది. ఇప్పుడు ఆ చెట్టు నాదంటే నాదని ఆ ఇద్దరూ పోట్లాడుకుంటున్నారు. మొదలు నాదొడ్డిలో ఉంది, చెట్టంతా నాదే, అంటాడు వసురాయ

కవి. 'మొదలు ఎక్కడుంటేనేం? చెట్టంతా ఉంది నాదొడ్డిలో' అంటాడు పోలీసు ఉద్యోగి. ఈ తగవు చూట్టానికి వాళ్ళింటి చుట్టూ జనం గుంపులు గుంపులుగా పోగయ్యారు. కొంతమంది చెట్లెక్కి చూస్తున్నారు; కొంతమంది గోడలెక్కి చూస్తున్నారు. ఇన్ని మాట లెందుకు? నెహ్రూని చూచినట్లు చూస్తున్నారంటే నామాట నమ్ము," అని విరగబడి నవ్వటం మొదలు పెట్టాడు పున్నారావు....

"అసలు ఎందుకొచ్చిందోయ్? మొదలు చెప్పకుండా చివర చెప్పి నీలో నవ్వునవ్వుకుంటే ఏం లాభం?" అన్నాను నేను.

"నిజమే," అన్నాడు పున్నారావు....సంగతి అంతా చెప్పటానికి ఉద్యుక్తుడై మిగిలిన కాఫీ నోటిలో పోసుకున్నాడు.

"ఆ బాదం చెట్టువుందే, పోలీసుఉద్యోగి సరకగావిరిగిపడిఉన్న బాదం చెట్టు, బాదంచెట్టు కాయలు అటువాళ్ళపిల్లలూ, ఇటువీళ్ళ పిల్లలూరోజూ కొట్టు కుంటూనే వుండేవారు. ఆ సందర్భంలో పిల్లల్లో పిల్లలకు చిన్న చిన్న కజ్జాలు అప్పుడప్పుడూ కలుగుతూ వచ్చినా, నిన్నటివరకూ అవి పెద్దల దాకా వెళ్ళలేదు. నిన్న రక్తికట్టింది దేనికైనా ముహూర్తం కలిసి రావాలంటారే అది ఇదే కాబోలు!!" అన్నాడు పున్నారావు....

"అది సరే, మరి కథ ఆపకు," అన్నాను నేను.

"చెపుతాగాని ముందు కాఫీత్రాగు ఆరిపోతూవుంది." అన్నాడు పున్నారావు.

"కాఫీ దేముందిలేవోయ్!" అన్నాను నేను.

"అలా కాదు మరి. అన్నాడు పున్నారావు.

నేను కాఫీ గడగడా త్రాగేశాను. పున్నారావు చెప్పాడు. "నిన్న ప్రొద్దున్న కవిపిల్లలు సరిహద్దుగోడ ఎక్కి బాదంకాయలు కొట్టుకుంటున్నారట! ఆ కాయలూ, ఈ కాయలూ కొట్టుకుని, చివ్వరికి పోలీసు వుద్యోగి దొడ్డిలోకి వ్యాపించిఉన్న కొమ్మలకాయలు కొట్టుకోసాగారట. కొట్టుకున్న

కాయలు క్రిందపడగానే, అక్కడే కాచుక్కూచున్న పోలీసు వుద్యోగి పిల్లలు వాటిని గబగబా ఏరుకున్నారట. అక్కడితో పోట్లాట రగులుకుం దిట. 'ఆ కాయలు మేం కొట్టుకున్నాం'' అని వీళ్ళూ, 'మా దొడ్డిలోపడ్డ కాయలు ఏరుకున్నాం.'' అని వాళ్లూ వేసుకున్నారట. మాటా మాటామీద పిల్లల తగదా పెరిగింది. ఆ పోలీసు ఉద్యోగి ఒక పెద్ద కొడుకు వున్నాడు. వాడు వయస్సులో పెద్దా, బుద్ధిలో చిన్నా-వాడు 'అసలీ గోడ ఎక్కే-హక్కే- మీకు లేదు.'' అన్నాడట.

''ఈ గోడ మాదే.'' అన్నాదట కవి చిన్నకూతురు.

'మాది' అన్నాడట వాడు.

'మా నాన్న కట్టించాడు' అన్నదట కవి చిన్నకూతురు.

'ఆ మీ నాన్నకితోడు ఒక గోడ కూడానా!'' అన్నాడట పోలీసు పెద్దకొడుకు—

దానికి కోపంవచ్చి, ఏమనటానికీతోచక, ''మీనాన్నే పెద్దగోడ. ఉఃళ్ళో సున్నం కొట్టని గోడలన్నీ మీ నాన్నే!!'' అన్నదట కవి చిన్న కూతురు. దాంతో పోలీసు వుద్యోగి పెద్దకొడుక్కి కోపం వచ్చిందట, తిడుతూ గోడయెక్కి, ఆపిల్లని గోడమీదనుంచి క్రిందకుతోశాడట. ఆ పిల్ల పాపం ఏడ్చుకుంటూ పోయి ఇంట్లో వంటచేసుకుంటున్న వాళ్ళ అమ్మకి చెప్పిందట. వాళ్ళఅమ్మపిల్లదాని ఏడుపు సహించలేక గబగబా బయటకివచ్చి చూస్తే,ఆ పోలీసువుద్యోగి పెద్దకొడుకు ఇంకా గోడమీద నుంచుని కాయలు కొడుతూనే వుండటం కనిపించిందట.

''ఎందుకు నువ్వుపిల్లదాన్ని కొట్టిండ?'' అని అడిగిందట ఆబిడ.

వాడికి వయస్సు పెద్దా, బుద్ధి చిన్నా అని చెప్పాను. కాదూ! అందుకని ఆమె అడిగిన ప్రశ్నకు ''ఈగోడ ఎక్కటానికి మీకు యెంత హక్కు వుందో, మాకు అంత హక్కు వుంది. ఈ కాయలు తింటానికి మీకు యెంత హక్కు వుందో మాకు అంత హక్కు వుంది'' అన్నాడట.

''నేను అడిగేది నా పిల్లని నువ్వు యెందుకుకొట్టావని?'' అని అన్నదట ఆబిడ.

"కొడితే కొట్టా" అన్నాడట వాడు.

"వాట్టదేనే అమ్మా—నేను కాయలు కొట్టుకుంటూవుంటే తాను కూడా గోడయెక్కి తిట్టి, కొట్టి కిందకుతోశాడే" అని ఏడుస్తూ చెప్పింది చిన్నకూతురు.

"చెల్లెలు చెప్పింది నిజమేనమ్మా" అన్నాడు కొడుకు

కొడుకు మాటమీద ఆమెకు అమిత నమ్మకం, కొట్టి, పైగా తన కూతురుమీద నేరం మోపుతున్నాడని ఆమెకు కోపంవచ్చి వుంటుంది. విజృంభించింది. "నీ వయస్సు ఎంత? దాని వయస్సు ఎంత!! నీ వయస్సుకి దానిమీద చెయ్యిచేసుకోటానికి నీకు సిగ్గెట్లా లేకపోయింది?— ముందు ఆ గోడదిగు— దిగుతావా దిగవా?" అని వెంటపడేటప్పటికి పోలీసు ఉద్యోగి పెద్దకొడుకు బిత్తరపోయి గబుక్కున గోడదూకి వూరుకున్నాడట!.... ఇంటిలోకి పరుగెత్తాడట. కవిభార్య పిల్లల్ని తీసుకొని లోపలకు వెళ్ళిందట. అంతటితో ఆగితే అదో రకంగా వుండేది. కాని ఆగలేదు. పోలీసువుద్యోగి భార్య ఇంటిలోకి పరుగెత్తుకొని వచ్చిన కొడుకుని పట్టుకుందట! 'పిరికి వెధవా!' అన్నదట. 'మీ నాన్నకడుపున ఎట్లాపుట్టినావురా!' అన్నదట.

"ఆ గోడ వాళ్ళదేనటమ్మా...." అన్నాడట పెద్దకొడుకు.

"గోడవాళ్ళదని నువ్వునాకు చెపుతున్నావట్రా....గోడవాళ్ళదైతే మన దొడ్డిలోకి వచ్చిన కొమ్మలు కొట్టుకోటానికేమిరా?" అన్నదట ఆమె.

దాంతో పోలీసు ఉద్యోగి పెద్దకొడుకు ఒక నౌకర్ని వత్తాసు తీసుకొని ముంగిటకు వచ్చి మళ్ళీ కాయలు కొట్టటం మొదలుపెట్టాడట. "ఏంరా, ఎవ్వడడ్డం వస్తాడో రమ్మను?" అన్నాడట నౌకరితో. "రమ్మను" అన్నాడట వాడు.... ఈ విధంగా వాళ్ళే ప్రశ్నలు వేసుకుంటూ, వాళ్ళే జవాబు చెప్పుకుంటూ రోడ్డంతా, చెట్టంతా నానా చీకాకూ చేసి వదిలి పెట్టారట.

ఇదంతా చూస్తూ వూరుకుందిట వసురాయకవి భార్య. ఆమె ఏదో పట్టరాని కోపంవస్తే తప్ప పోట్లాటకు దిగే మనిషికాదట! మెదలకుండా వూరుకొని భర్త యింటికి రాగానే "ఇక ఈ యింటిలో గడియ కాపురం చెయ్యలేం" అన్నదట "పెద్దా చిన్నా లేకుండా ఎగబడుతుంటే!" అన్నదట. "అది కన్నీరు పెట్టుకుంటూ అమ్మా అని ఏడుస్తుంటే గుండె తరుక్కుపోయింది" అన్నదట. "అన్నింటికీ నౌకర్ని పెద్దకొడుకుని తోలుతుంటే, మీరు వొకప్పుడు వుంటారూ, ఉండరు. ఆడవాళ్ళం పొరుగున బ్రతికేదెట్లా?" అన్నదట "ఏమాట అంటానికి, ఏ పని చెయ్యటానికీ వెరవదాయె," అన్నదట. "ఇల్లన్నా మార్పించండి. వాళ్ళ దొడ్డిలోకి వెళ్ళిన చెట్టుకొమ్మలన్నా కొట్టించి వెయ్యండి....లేకపోతే వాళ్ళు ఏదో వొక వంకపెట్టుకొని రాకామానరు. తగాదాలు తప్పవు" అన్నదట. భార్య మాటలువిని వసురాయకవి వుగ్రుడైనాడట. తానే గొడ్డలి పట్టుకొని కొమ్మలు కొట్టటానికి బయలుదేరాడట. "యెవ్వడు అడ్డం వస్తాడో రండి" అని పోలీసు వుద్యోగికి సంబంధించిన వాళ్ళందరికీ వినబడేటట్లు కేకవేసి గోడ యెక్కాడట. ఎవ్వరో "కొమ్మలచివ్వర్లు మా దొడ్డిలో వున్నాయి. అవిమావే," అన్నారట.... వాటి మొదళ్ళు మా దొడ్డిలో వున్నాయి. వాటిని నరుకుతున్నాను....రండి ఎవ్వరు అడ్డం వస్తారో" అని ఒక్కొక్క కొమ్మనే నరికివేశాడట...." ఇలా చెప్పుకు పోతున్నాడు పున్నారావు.

వింటున్నకొద్దీ నాకుఆశ్చర్యం వేసింది. ఇంతంత పెద్దవాళ్ళు ఇంతింత చిన్న చిన్న విషయాల్లో ఇంత అల్పులు ఎలా అవుతారా, అని ఆశ్చర్య పడ్డాను. ....ఇంకా తెలుసుకుందామని. "మరి ఆ పోలీసు ఉద్యోగి ఊరుకున్నాడా?" అని అడిగాను.

"అప్పుడతను ఇంటిలో లేడు" అన్నాడు నామిత్రుడు. భార్య మాత్రం అప్పటికి కుక్కినపేనుకుమల్లే ఊరుకుందట. భర్త డ్యూటీనుంచి రాత్రి ఏ పదిగంటలకో వచ్చాడట. అప్పుడు తన ప్రతాపం చూపిందట. జరిగిందంతా చెప్పటమేకాక, కవి తన్నుకూడా యెత్తిపొడిచాడు. అన్నదట. "మీరు పోలీసు ఉద్యోగం చేసినా ఏం లాభం? ప్రతిపెధవకీ-ఆడవాళ్ళకీ

మొగవాళ్ళకి లోకువే!" అన్నదట. "అసలు ఆ చెట్టు అక్కడ లేకుండా చెయ్యండి. లేకపోతే ఏదో ఒకనెపంతో తగాదా పెట్టుకోకమానరు వాళ్ళు" అన్నదట. "ఆవిడ యెప్పుడు పోట్లాడుదామా అని తట్టముందు పెట్టుకు కూర్చుంటుంది. నే నెక్కడ ఆవిడతో...." అని కన్నీరు పమిటచెంగుతో తుడుచుకుందట. "దానివయస్సుకి అది, మీ నాన్నే ఒకగోడ. వూళ్ళో వున్న సున్నంలేని గోడలన్నీ మీనాన్నే" అన్నదట. ఎటువంటిమాట వినవలసి వచ్చింది." అని యెక్కెక్కి యేడ్చిందట? ఆ పోలీసు వుద్యోగి ఏదన్నా, యెన్నన్నా ఓర్చుకో గలడట గాని, కలకంఠికన్నీరు మాత్రం ఓర్చుకోలేడట. భార్యని కౌగిటిలోకి జేర్చుకొని, "నేను సరిచేస్తా, నువ్వూరుకో. ఓసి పిచ్చిదానా....ఊరుకోవు." అని బుజ్జగించాడట. రాత్రి అందర్నీ పడుకోనిచ్చి ఒక గొడ్డలితో బయటకువచ్చి రెండు వ్రేటులతో ఆ బాదంచెట్టు మొదలు నరికివచ్చి యేమీ యెరగనట్టు పడుకున్నాడట." ఇంతవరకుచెప్పి మళ్ళీ తనలో తాను నవ్వుకోవటం ప్రారంభించాడు పున్నారావు. మళ్ళీ రెండు కప్పులు స్ట్రాంగ్ కాఫీకి ఆర్డరిచ్చాడు....

పున్నారావు కోతలు కోసేరకంకాదు. అయినా ఈ కథ నేను నమ్మలేకపోయాను. ఆంబోతులవంటి మనుష్యులిద్దరు ఎంత కోపంవచ్చినా ఈ విధంగా ప్రవర్తిస్తారని నమ్మటం నిజంగా నాకు కష్టం. అనిపించింది_ "నువ్వు చెప్పిందంతా నిజమేనా పున్నారావు?" అని అడిగాను.

"బాగుంది" అన్నాడు పున్నారావు. నవ్వుతూనే "ఇంతకుముందే నేను అటునుంచి వస్తున్నా....ఆ పోలీసు ఉద్యోగి వసురాయకవీ సరిహద్దు గోడమీద యెక్కి తందనాలు ఆడుతుంటే యేమిటో చూద్దామని వెళ్ళా. ఏముంది? ఆ చెట్టు నా దంటే నాదనీ, నువ్వు పెళ్ళాన్ని వెనకవేసుకు వస్తున్నావంటే నువ్వు వేసుకు వస్తున్నావనీ, నీ పిల్లలు మర్కటాలు అంటే నీ పిల్లలు మర్కటాలనీ, ఈగోడ నాదంటే నాదనీ, పోట్లాడుకుంటున్నారు. పైగా నన్నుపిలిచి ఆ చెట్టు యెవ్వరికి చెందుతుందో తీర్పు చెప్పమని అడిగారు...."

సర్వర్ కాఫీతెచ్చి ముందుంచాడు. నేను కాఫీ ఆరబోసుకుంటూ, "మరి నువ్వేం చెప్పావ్?" అన్నాను.

"ఈ చెట్టు మీ యెవ్వరిదీ కాదన్నా, ఎవ్వరికన్నా బీదవాళ్ళకిస్తే నాలుగురోజులు పొయ్యిలోకన్నా సరిపోతుందిఅన్నా. హద్దుల దేముంది? అవి మానవ కల్పితాలు అన్నా. దాంతో యిద్దరూ కస్సుమంటూ లేచారు నామీదకు. నా కెందుకని నేను వచ్చేశా" అన్నాడు పున్నారావు.

"వాళ్ళింకా ఆగోడమీద నుంచొని పోట్లాడుకుంటూ ఉండే ఉంటారు. ఏం జనం! ! తీర్థప్రజ అంటే నమ్మ" అని కులికాడు.